ప్రజాశక్తి
ఆదివారం 20 నవంబరు 2022
5
శ్రీకాకుళం

65 మంది వృద్ధ కళాకారులకు పింఛన్లు

శ్రీకాకుళం : జిల్లాలో కొత్తగా 65 మంది రంగస్థల వృద్ధ కళాకారులకు పింఛన్లు మంజూరు కానున్నట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. వృద్ధ కళాకారుల పింఛన్ల జిల్లాస్థాయి ఎంపిక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టర్ ఛాంబరులో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాళీలను అనుసరించి మిగిలిన పింఛన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో కొత్తగా వృద్ధ కళాకారుల పింఛన్ల కోసం 90 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించి 65మందిని అర్హులుగా గుర్తించినట్లు కమిటీ కన్వీనర్, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్ వివరించారు. సమావేశంలో కమిటీ చైర్మన్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సభ్యులు జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆర్.గడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనలో రెవెన్యూ శాఖదే కీలకపాత్ర

- విజయవంతం చేయాల్సిన బాధ్యత మనపైనే ఉంది
- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- పర్యటనకు పక్కా ఏర్పాట్లు : కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఈనెల 23వ తేదీన ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర పోషించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. రైతులకు భూ హక్కు పత్రాలను అందించే కార్యక్రమం అత్యంత ప్రాధాన్యమైందన్నారు. సభా వేదిక వద్దకు పలు ప్రాంతాల నుంచి వచ్చే రైతులు సకాలంలో చేరుకునేలా చూడాలని సూచించారు. పర్యటన బాధ్యతలను చూస్తున్న ప్రభుత్వ శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను చూస్తూనే, తాము గుర్తించిన అంశాలేమైనా ఉంటే సంబంధిత శాఖ అధికారులకు తెలియజేసి సమన్వయంతో పనిచేయాలన్నారు. భూ హక్కు పత్రాలు అందించే కార్యక్రమం రెవెన్యూశాఖదేనన్నారు. పర్యటన విజయవంతమైనా, ఫెయిల్ అయినా ఆ శాఖదే బాధ్యత అని చెప్పారు.

సభకు రైతుల తరలింపులో ఎటువంటి ప్రణాళిక తయారు చేశారని జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరిని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అడిగారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల నుంచి పది వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఇందుకోసం 200 బస్సులు అవసరమవుతాయని ఆమె బదులిచ్చారు. ఆర్టీసీ నుంచి 130 బస్సుల వరకు సమకూర్చగలమని ప్రజా రవాణా అధికారి విజయకుమార్ చెప్పారు. ప్రయివేట్ ఆపరేటర్లు, పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి మిగిలిన 70 బస్సులను సమకూర్చాలని డిటిసి శ్రీదేవిని కలెక్టర్ ఆదేశించారు. స్టేజ్ ఏర్పాట్లు చూడాలని డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ఆహార ఏర్పాట్లపై జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ జయంతి, డిఎస్‌ఒ వెంకటరమణను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇని ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి మీనాక్షి మాట్లాడుతూ వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. మెడికల్ టీం ఉన్నట్లు బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. అత్యవసర మెడికల్ పాయింట్, మెడిసిన్ సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశం జరిగే ప్రాంతం, హెలీప్యాడ్, సభాస్థలం వద్ద శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని డిపిఒకు సూచించారు. రీ సర్వేకు సంబంధించి స్టాల్స్‌పై జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వివరించారు. రిజిస్ట్రేషన్ శాఖ ఏర్పాటు చేయనున్న స్టాల్స్‌పై జిల్లా రిజిస్ట్రార్ వివరించారు.

ఎస్‌పి జి.ఆర్ రాధిక మాట్లాడుతూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుకు పక్క జిల్లా నుంచి పోలీసులను తీసుకొస్తున్నట్లు వివరించారు. పార్కింగ్ ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. బారికేడింగ్ రెండువైపులా ఉండాలన్నారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ రెడ్డి, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు, ఆర్అండ్‌బి ఎస్‌ఇ కాంతిమతి, ఆర్‌డిఒ బి.శాంతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ ప్రసాదరావు, ఆర్‌టిఒ గంగాధర్, సిపిఒ లక్ష్మీప్రసన్న, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి వీరభద్రరావు, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, సర్వే ఎడి ప్రభాకరరావు, డిఎస్‌పి శివరాం తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

డిసెంబరులో పోర్టుకు శంకుస్థాపన

- తీర ప్రాంతాల్లో మినీ షిప్ ల్యాండ్ కేంద్రాలు
- మత్స్యశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

సంతబొమ్మాళి మండలంలో భావనపాడు పోర్టు నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయని, వచ్చే నెలలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రగతి భవనంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు నిర్మాణానికి న్యాయపరమైన సమస్యలు లేకుండా ఉండేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు.

భూములు అప్పగించే రైతుల్లోనూ ఎటువంటి అపోహలు లేవన్నారు. పోర్టు పనులకు టెండర్లను ప్రభుత్వం పిలిచిందని తెలిపారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో జెట్టీల స్థానంలో హార్బర్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని, మరో ఆరు నెలల్లో వాటి నిర్మాణానికి అనుమతులు వస్తాయని తెలిపారు. జిల్లాలో తీర ప్రాంతాల్లో రూ.25 లక్షలతో మినీ షిప్ ల్యాండ్ కేంద్రాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు పునఃప్రారంభానికి నిధులు మంజూరయ్యాయన్నారు. కోసంగిపురం, బెండిగేటు, మందస, హరిపురం, పూండీ, వజ్రపుకొత్తూరు సెంట్రల్ డివైడింగ్ రహదారి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పలాస రైల్వే ఫ్లై ఓవర్ వంతెన పనులు వేగవంతంగా సాగుతున్నాయన్నారు. 200 పడకల కిడ్నీ ఆస్పత్రి, పరిశోధనా కేంద్రం నిర్మాణం తుది దశకు చేరుకుందని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

జిల్లా అభివృద్ధిపై సిఎం ప్రకటన చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఈనెల 23న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జిల్లా పర్యటనలో సమస్యలు పరిష్కరించి జిల్లా అభివృద్ధిపై ప్రకటన చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు డిమాండ్ చేశారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నేరడి వద్ద వంశధారపై బ్యారేజీ నిర్మించి రెండు పంటలకు నీరు ఇచ్చి జిల్లాను సస్యశ్యామలం చేయాలని డిమాండ్ చేశారు. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. జిల్లాలో ఎత్తిపోతల పథకాల మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో దోమపోటు వల్ల పంట నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

జిల్లాలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లేకపోవడం వల్ల ఏ ప్రమాదాలు సంభవించినా శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్లే లోపు అనేక మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయన్నారు. అందువల్ల రిమ్స్‌ను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. వంశధార నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించి వెంటనే పనులు ప్రారంభించి నిర్మించాలని డిమాండ్ చేశారు. వినాశకర కొవ్వాడ అణుపార్కును రద్దు చేయాలని కోరుతూ శాసనసభలో తీర్మానం చేయాలన్నారు. ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తులకు తీవ్రత దష్టిలో పెట్టుకొని 102 జిఒను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటిడిఎను ఏర్పాటు చేయాలని, శ్రీకాకుళం నగరంలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీని నిర్మించాలని డిమాండ్ చేశారు. కోడి రామ్మూర్తి స్టేడియం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఎచ్చెర్ల మండలం నారాయణపురం భూ సాగుదారులకు పట్టాలు ఇవ్వాలన్నారు. మందస మండలంలో ఒడిశాతో ఉన్న సరిహద్దు సమస్యను పరిష్కరించాలన్నారు.

గంజాయి పట్టివేత

స్వాధీనం చేసుకున్న గంజాయి

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం వద్ద జాతీయ రహదారిపై అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణాపై సమాచారం అందుకున్న పోలీసులు పురుషోత్తపురం వద్ద జాతీయ రహదారిపై తనిఖీలు చేపట్టారు. సంచులతో వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, అందులో రూ.99 వేల విలువ గల 33 కేజీల గంజాయి ఉంది. గంజాయిని స్వాధీనం చేసుకుని, దాన్ని తరలిస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. నిందితులు రెయ్యా త్రినాథ్, పైల వాసు మండలంలోని పురుషోత్తపురానికి చెందిన వారు కాగా, మరొకరు ఒడిశా సరిహద్దు గ్రామం సుమండికి చెందిన వారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ సతీష్ కుమార్ తెలిపారు. దాడిలో పట్టణ ఎస్ఐ గోవిందరావు, డిప్యూటీ తహశీల్దార్, విఆర్‌ఒ పాల్గొన్నారు.

అతిక్రమణలు లేకుండా అనుమతులు

శ్రీకాకుళం అర్బన్ : గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనలో అతిక్రమణలు లేకుండా అనుమతుల మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. అటవీశాఖ, ఐటిడిఎ, ఇంజినీరింగ్ అధికారులతో జిల్లాస్థాయి సోషల్ ఫారెస్ట్ కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందవసాయి నుంచి కొనక రీచ్-1, రీచ్-2 రహదారులపై జిల్లాస్థాయి కమిటీలో చర్చించి సాధ్యాసాధ్యాలపై అనుమతులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే సమావేశం నాటికి ఫొటోలతో నివేదిక అందజేయాలని ఇఇని ఆదేశించారు. సమావేశంలో సీతంపేట ఐటిడిఎ పిఒ బి.నవ్య, అటవీశాఖ అధికారి నిషాకుమారి తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - గార

జిల్లాలో పేదలకు నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. నవరత్నాలు - పేదలకు ఇళ్లులో భాగంగా మండలంలోని అంపోలు వద్ద పట్టణ పేదల కోసం నిర్మిస్తున్న గృహ నిర్మాణాలను కలెక్టర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్లాబ్ స్థాయిలో ఉండే గృహ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్మాణాల్లో నాణ్యతను పాటించాలని సూచించారు. ప్రతి ఇంటికీ విద్యుత్ అందేలా చర్యలు చేపట్టాలన్నారు. రహదారులు, తాగునీరు, మురుగునీటి కాలువలు తదితర మౌలిక సదుపాయాలనూ కల్పించాలని సూచించారు. సామూహిక గృహ నిర్మాణాలు పూర్తయితే ఒక గ్రామంగా రూపుదిద్దుకుంటుందన్నారు. లబ్ధిదారులు ముందుకు వచ్చి గృహాలు నిర్మించుకునేలా చైతన్యపరచాలన్నారు. గృహ నిర్మాణాలకు ముందుకు రాని వారిని తొలగించి వారి స్థానంలో కొత్త వారికి అవకాశం కల్పించాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎన్.గణపతిరావు, ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

మాట్లాడుతున్న విశ్రాంత జడ్జి జగన్నాథరావు

వినియోగదారుల కొత్త చట్టంతో హక్కులకు రక్షణ

విశ్రాంత జడ్జి పి.జగన్నాథరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వినియోగదారుల రక్షణ చట్టం కొనుగోలుదారుల హక్కులకు రక్షణ కల్పిస్తుందని విశ్రాంత జడ్జి, మేధావుల ఫోరం అధ్యక్షులు పప్పల జగన్నాథరావు తెలిపారు. నగరంలోని పి.ఎన్ కాలనీలో గల నారాయణ తిరుమల ప్రాంగణంలోని యోగా కేంద్రంలో శనివారం నిర్వహించిన ఫోరం సమావేశంలో మాట్లాడారు. కొత్త చట్టంలో వినియోగదారునికి ఆరు హక్కులు కల్పించిందని చెప్పారు. వస్తువుల ఉత్పత్తులు, సేవల నాణ్యత, పరిమాణం, శక్తి, స్వచ్ఛత, ప్రమాణం, ధర తెలుసుకునే హక్కు ఉందన్నారు. పోటీ ధరలకు వస్తువులు, ఉత్పత్తుల సేవలను పొందవచ్చునని తెలిపారు. వినియోగదారుల దోపిడీకి అన్యాయమైన వాణిజ్య పద్ధతులకు వ్యతిరేకంగా పరిష్కారం పొందవచ్చని చెప్పారు. వినియోగదారుల హక్కుల ఉల్లంఘనపై విచారణ, వస్తువులను వాపసు తెచ్చుకోవడం, ప్రమాదకరమని భావించే సేవలను ఉపసంహరించుకోవాలని ఆదేశాలు జారీ చేసే అంశాలను వివరించారు. తప్పుదోవ పట్టించే ప్రకటనలను నిలిపివేయడం, సవరించేందుకు ఆదేశాలు జారీ, ఉల్లంఘనలకు జరిమానా విధింపు వంటి చట్టం ముఖ్య లక్షణాలు, కేంద్ర వినియోగదారుల పాత్ర, సెంట్రల్ అథారిటీ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో కె.పోలినాయుడు, కె.అమ్మన్నాయుడు, ఎం.అన్నాజీభట్లు, బి.అర్జునరావు, ఎ.సత్యనారాయణ, కె.తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ డీడీకి ఫిర్యాదు చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

శ్రీకాకుళం ఎస్‌టిఒపై చర్య తీసుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం సబ్ ట్రెజరీ అధికారి డి.నవీన్‌చంద్ పెన్షనర్ల బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తున్నారని, డబ్బులు చెల్లించనిదే బిల్లులు పాస్ చేయడం లేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ విమర్శించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జిల్లా ట్రెజరీ అధికారి రవికుమార్‌ను శనివారం కలిసి వినతిపత్రాలను అందజేశారు. శ్రీకాకుళం రూరల్ మండలంలో నవనంపాడు ఉన్నత పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన బి.గోవిందరావు పెన్షన్ మంజూరు ఉత్తర్వులు జిల్లా ట్రెజరీకి జులై 12న చేరాయని, ఆగస్టు 26న సబ్ ట్రెజరీకి పంపినట్లు తెలిపారు. నేటికీ పెన్షన్ చెల్లింపు కాలేదన్నారు. లేనిపోని కారణాలు చెప్తూ జాప్యం చేస్తున్నారని, ఉపాధ్యాయుడిని ఇబ్బందులకు గురిచేస్తూ కాళ్లరిగేలా తిప్పుతున్నారని చెప్పారు. ముడుపులు చెల్లించనిదే బిల్లు పాస్ కాదని తెగేసి చెప్తున్నారని ఫిర్యాదు చేశారు. ఎస్‌టిఒపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పలు సబ్ ట్రెజరీల్లో పెన్షన్ చెల్లింపుల్లో కొంతమంది సబ్ ట్రెజరీ అధికారులు జాప్యం చేస్తున్నారని చెప్పారు. జీతాల చెల్లింపులోనూ నిర్లక్ష్యం వహిస్తున్నారని, జాప్యం లేకుండా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజీరావు, జిల్లా నాయకులు బి.క్రాంతికుమార్, ఎల్.కోదండరామయ్య, బాధిత పెన్షనర్ బి.గోవిందరావు, సిహెచ్.రాజారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వ్యాఖ్యలు ఆక్షేపణీయం

నరసన్నపేట : మూడు రాజధానులకు మద్దతు పలుకుతున్న వారికి చెప్పు చూపించాలని ఉందంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన వ్యాఖ్యలు తీవ్ర ఆక్షేపణీయమని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెప్పుల రాజకీయాలతోనే చంద్రబాబు దొడ్డిదారిన ముఖ్యమంత్రి అయిన విషయం తెలుగు ప్రజలందరికీ తెలుసునని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సారథ్యంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముందుకు సాగుతుంటే దిక్కుతోచని స్థితిలో చంద్రబాబు తనకు ఇవే చివరి ఎన్నికలు అంటూ ప్రజల సింపతీ కోసం పన్నిన వ్యూహం బెడిసికొట్టిందని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలు సమగ్రంగా అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం బలంగా నమ్ముతోందని స్పష్టం చేశారు. ఇప్పటికైనా తన సంధి ప్రేలాపనలు ఆపకపోతే ప్రజలే తరిమికొడతారని హెచ్చరించారు.

ఒక్క ఛాన్స్... మరో ఛాన్స్... ఆఖరి ఛాన్స్

అస్థిత్వ రాజకీయాలు యథేచ్ఛగా రాజ్యమేలుతున్నాయి. ఇలాంటి తరుణంలో రెండేళ్ల నుంచి ప్రధాన రాజకీయ పార్టీలు తరతమ తేడాల్లో ముందస్తు ఎన్నికల హడావుడి ప్రారంభించాయి. ఈ పరిస్థితి 75 ఏళ్ల స్వాతంత్ర్య దేశంలో ఏనాడూ లేదు. ప్రజల బాధలను, ముంచుకొచ్చిన ప్రమాదాలను పట్టించుకోకుండా ప్రధాన పార్టీలు రెండూ అధికారం కాపాడుకోవడం, మళ్లీ దక్కించుకోవడం పనిలో ఉన్నాయి. పరస్పర విమర్శలు, దూషణలకు పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు పలు రాగాలు, యుగళగీతాలు ఆలపించిన జనసేన నేత పవన్‌కళ్యాణ్ తాజాగా విజయనగరం జిల్లా పర్యటనలో ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను వేడుకున్నారు. అంటే తానే ముఖ్యమంత్రినన్న భావన అందులో ఉంది. ఒక్కసారి అవకాశం ఇస్తే ప్రజలను మోసం చేశారని జగన్‌ను విమర్శిస్తున్న పవన్, ఈసారి అదే నినాదాన్ని అందుకోవడం విశేషం. అంతేకాదు సంక్షేమ పథకాలను ఎంగిలి మెతుకులుగా అభివర్ణించారు. నిన్నటి వరకు బిజెపి చక్రబంధంలో ఉన్నారనుకున్న పవన్, అందులో నుంచి బయటపడ్డారని టిడిపితో మళ్లీ చెలిమి మొదలువుతుందన్న ప్రచారం సాగుతోంది. విశాఖ ఘటన అనంతరం ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంపై సంయుక్త ప్రకటన ఆ ప్రచారానికి బలాన్నిచ్చింది. ఒక్క అవకాశం ఇవ్వాలన్న నినాదంతో గాలి తీసేసినట్లయింది. రాజ్యాంగాన్ని ఛిద్రం చేస్తున్న కమలాన్ని వదిలి ప్రజాస్వామ్య రక్షణ నినాదం దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నాయన్న నానుడిని గుర్తుచేశాయి. మోడీని కలిసిన తర్వాత పవన్ నినాదం మారిపోయింది. జనసేన ఆవిర్భవించి దశాబ్ద కాలమవుతున్నా నేటికీ ఆ పార్టీకి పూర్తిస్థాయి నిర్మాణ రూపం లేదు. నిర్దిష్టమైన రాజకీయ వ్యూహం లేకుండా గళం మార్చి కప్పగంతులు వేస్తూనే ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాతో పాటు పలు జిల్లాల కమిటీలు లేవు సరికదా నాయకులు ఎవరో తెలియని పరిస్థితి ఉంది. గతంలో పోటీ చేసిన చోట ఆ అభ్యర్థులే నియోజకవర్గ ఇన్‌ఛార్జీలుగా చెలామణి అవుతున్నారు. కమిటీలే లేకున్నా గ్రూపుల గోల వినిపిస్తోంది. బహిష్కరణలు, సహాయ నిరాకరణలు పెరుగుతున్నాయి. ఇటీవల టెక్కలి నియోజకవర్గ నేతల్లో తలెత్తిన విభేదాలే అందుకు ఉదాహరణ. ఇలాంటి పరిస్థితిలో ఒక్కసారి అవకాశం నినాదం ప్రచారానికి తప్ప ఆచరణ సాధ్యం కానిదని ఆ పార్టీ అభిమానులే చెప్పే పరిస్థితి ఉంది. ఈ నినాదం కూడా ఎన్నికల వరకు ఉంటుందని భావించలేం.

వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఈసారి అధికారంలోకొస్తే 30 ఏళ్లు పాలించవచ్చని ప్రజలకు చెప్తున్నారు. మరోవైపు 175 స్థానాల్లో గెలవాలని, ప్రజల్లో ఉండాలని నేతలకు చెప్తున్నారు. నిత్యం సమీక్షలు చేస్తున్నారు. సంక్షేమం గొడుగు కింద అభివృద్ధి తేలిపోతుంది. కేంద్రం బాటలో ప్రజా వ్యతిరేక ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలు తీవ్రతరమవుతున్నాయి. పాలనలో మాటల ధార తప్ప కాసుల బాధ కనిపించడం లేదు. అన్ని వర్గాల ప్రజలకు దూరమవుతున్నారు. మంత్రులు డమ్మీలుగా మారిపోయినట్లు తెలుస్తోంది. ఆయా శాఖల మంత్రులకు తెలియకుండానే జిఒలు వస్తున్నాయని, విధానపరమైన నిర్ణయాలు జరిగిపోతున్నాయని ఆ పార్టీ నేతలే చెప్తున్నారు. జిల్లాలో పలు నియోజకవర్గాల్లో గ్రూపుల గోల రోజురోజుకూ బలపడుతోంది. ప్రభుత్వ సర్వే ఆధారంగా మూడు నియోజకవర్గాల్లో కొత్త అభ్యర్థులు తెర పైకి రానున్నారని, ప్రస్తుత నేతలు ఓటమిపాలయ్యే అవకాశం ఉందని సర్వే నివేదిక వెల్లడిస్తోందని తెలిసింది. అధినేత అతివిశ్వాసంతో వెళ్తున్నారని పార్టీలోనూ నిరంకుశ ధోరణులు, ఏకపక్ష నిర్ణయాలు జరిగిపోతున్నాయని సీనియర్లు చెప్తున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, మధ్యతరగతి ప్రజలు పాలనపై మండిపడుతున్నారని, పాలనపై ప్రతికూలత ఉందని పట్టణ, నగర ప్రాంతాల్లో ప్రతికూల తీర్పులు రానున్నాయని సర్వే నివేదిక ప్రభుత్వాన్ని హెచ్చరించినట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. జిల్లాలో తొలుత టెక్కలి అభ్యర్థిని ప్రకటించినా టిక్కెట్ ఆశించిన నేతలకు హామీలు, భరోసాలు ఇచ్చినా పరిస్థితుల్లో ఎలాంటి మార్పు వచ్చినట్లు కనిపించడం లేదు. మండలాల వారీగా సమావేశాలు పెట్టి ఇన్‌ఛార్జీగా తప్పించాలని గోల చేస్తే ఏకంగా ముందస్తు టిక్కెట్ ప్రకటించడం కొందరు నేతలకు మింగుడు పడడం లేదు. ఐదు నియోజకవర్గాల్లో అసమ్మతిరాగం వినిపిస్తోంది. జిల్లా అధ్యక్షులు ఆ రాగాన్ని ఆలపించే పరిస్థితిలో లేదన్నది వెల్లడవుతోంది. ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ ప్రవచనాలు చెప్పి వెళ్తున్నారు తప్ప క్రియాశీల చర్యలేవీ ఉండడం లేదని ఆ పార్టీ నేతలే చెప్తున్నారు. సంక్షేమం గొడుగు రక్షిస్తుందన్న ధీమా అధినేతలో ఉందని... అభివృద్ధి లేమి, భారాల వెల్లువకు ఆ గొడుగు నిలుస్తుందన్న నమ్మకం కలగడం లేదని పార్టీ సీనియర్లు చెప్తున్నారు. మూడు నెలల కిందట ముఖ్యమంత్రి జిల్లాకు వచ్చి వాగ్దానాలు కురిపించినా, ఏ ఒక్క దానికీ ఒక్క రూపాయి కూడా రాలేదని వారు గుర్తు చేస్తున్నారు. జిల్లాలోని వైసిపి నేతలు ఎవరికి వారే వ్యవహరిస్తున్నారు తప్ప సమిష్టిగా జిల్లాకు ప్రజలకు ఏం చేద్దామన్న ఆలోచన చేసే పరిస్థితి లేదు. అలాంటి ఐక్యత కొరవడింది. ఈ కాలంలో ఉత్తరాంధ్ర ద్రోహులు నినాదం వినిపించారు. పాలనా రాజధానిగానే కాదు విశాఖ ఏకైక రాజధాని అని నినాదం ఇచ్చారు. వారి మాటల్లో ఉన్న జోరు, వాడి వేడి ప్రజల్లో కనిపించడం లేదు. పాలనా తీరుతో పాటు రాజకీయ వ్యూహాలను మార్పు చేసుకుంటే మళ్లీ అధికారం అన్న మాట బాగుంటుందని సీనియర్లు చెప్తున్నారు. ఆ పార్టీ ఎమ్మెల్సీ రామచంద్రయ్య ఇటీవల మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో యుద్ధమే ఉంటుందని వైసిపి గెలుపు అంత సులభం కాదని చెప్పడం విశేషం.

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వైసిపి ప్రభుత్వం కూలుతుందని, అధికారం తమదే అని చెప్తూ కర్నూలు పర్యటనలో కొంత అభద్రతకు లోనైనట్లు కనిపించింది. ఈసారి గెలవకపోతే ఇవే తన చివరి ఎన్నికలని చెప్పడంతోనే తన సర్వే నివేదికలు ప్రతికూలంగా ఉన్నాయని చెప్పకనే చెప్పినట్లయింది. తన వయసు పెరిగినా ఫిట్‌గానే ఉన్నానని పక్షం విమర్శకు సమాధానం చెప్పినట్లయింది. కర్నూలు పర్యటనలో పవన్ కళ్యాణ్ తనకు దూరమవుతున్నారన్న వాతావరణంలో ఆపైన కూడా పరోక్ష విమర్శ చేయడం విశేషం. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల సమీక్షలు ఒకవిడత పూర్తి కావాలి. గ్రూపుల గోల ఆ పార్టీకి వెన్నంటే ఉంది. జిల్లాలోని అగ్ర నేతలు ఏనాడూ కలిసి కార్యక్రమాలు చేపట్టడం లేదు. కనీసం ప్రెస్‌మీట్ ద్వారానైనా ఐక్యత కానరాదు. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో అభ్యర్థులను మారుస్తారన్న ప్రచారం ఆ పార్టీలోనే ఉంది. నేను మారాను, మీరు మారాలని నేతలు, కార్యకర్తలకు చంద్రబాబు చెప్పేవారు. ఇప్పుడు మాత్రం మీరు మళ్లీ మారాలని నేతలు అధినేతకు చెప్పే పరిస్థితి వచ్చింది. కర్నూలులో తన రోడ్ షోపై నిరసనలకు ఆగ్రహించిన చంద్రబాబు, విశాఖలో ఉక్కు శిబిరంపై ప్రభుత్వం దాడి చేస్తే స్పందించలేదు. మోడీ ప్రాపకం కోసం జగన్ ఆ దుర్మార్గానికి ఒడిగడితే, మోడీకి కోపం వస్తుందని చంద్రబాబు ఖండించలేదు. మోడీ పర్యటనలో టిడిపి ప్రేక్షకపాత్ర పోషించింది తప్ప రాజకీయ పార్టీ పాత్ర నిర్వహించలేదు. రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన వెరసి నరేంద్ర మోడీ ప్రభుత్వానికి భజన చేస్తున్నాయన్నది సుస్పష్టం. కేంద్ర ప్రభుత్వ దుర్మార్గ చర్యలకు, పాలనకు వ్యతిరేకంగా కనీసం గళం విప్పితేనే ప్రజలు ఆలోచిస్తారు. కనీసం ప్రజలు ఆలోచించడానికైనా తమ రాజకీయ విధానాలను, వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంది. ఆర్థిక విధానాల విషయంలో ఆ మూడు పార్టీలు ఒక తాను గుడ్డలే అన్నది మాటలు, చేతలు చెప్తున్నాయి. జిల్లా ప్రజలు కూడా ఆ మార్పు కోసం చూస్తున్నారు. లేకుంటే కొత్త ప్రత్యామ్నాయ శక్తులు ముందుకు తోసుకొస్తాయి.

- సత్తారు భాస్కరరావు

మహారాజశ్రీ కాకినాడ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.P.No. 22/2022

Between:

YEJJALA SRIDHAR, S/o Malleshu, age 39 years, D.No.38-4-3/1, Tilak Street, Near Yogananda School, Kakianda, Permanent resident of D.No.1-119, Devara Street, Narsipuram Village, Nandigam Mandal, Srikakulam District. ***...Petitioner***

AND

Putta Sathish and 13 Others ***...Respondents***

TO:

1) PUTTA SATHISH, S/o. Narayana Rao, age 38 years, Flat No.23, Bala towers, Buddhavarapu vari street, Kakinada.
2) INUKURTHI SRIRAM. S/o. Adinarayana, age 24 years, D.No.16-24-1/1A, Gowthami Nagar, Sambamurthy Nagar, Street No.5, Kakinada.
3) POTTI DURYODHANA. S/o. Rudrayya, age 27 years, D.No.2-64, Potti vari street, Kuttuma Village, Kanchili mandal, Srikakulam District-532292.
4) KONAPALA BALAJI. S/o. Srinivasa Rao, age 28 years, D.No.18-64, Dabha Colany, Sompeta town, Sompeta mandal, Srikakulam District-532284.
5) KONAPALA PUNYAVATHI. W/o. Srinivasa Rao, age 50 years, D.No.18-64, Dabha Colany, Sompeta town, Sompeta mandal, Srikakulam District-532284.
6) KONAPALA SRINIVASA RAO @ SRINIVAS, S/o. not known, age 55 years, D.No.18-64, Dabha Colany, Sompeta town, Sompeta mandal, Srikakulam District-532284.
7) TAMMINANA YOGESWARA RAO, S/o. Satyanarayana, age 25 years, D.No.7-4-57, Denki Street, Kasibugga village, Palasa mandal, Srikakulam District-532222.
8) TAMMINANA KISHORE. S/o. Satyanarayana, age 27 years, D.No.7-4-57, Denki Street, Kasibugga village, Palasa mandal, Srikakulam District-532222.
9) TAMMINANA LEELA, W/o. Satyanarayana, age 47 years, D.No.7-4-57, Denki Street, Kasibugga village, Palasa mandal, Srikakulam District-532222.
10) TAMMANA BHARGAV, S/o. Satyanarayana, age 47 years, D.No.7-4-57, Denki treet, Kasibugga village, Palasa mandal, Srikakulam District-532222.
11) TUNGANA RAMU, S/o. Krishna Rao, age 28 years, D.No.3-52, Patha Tekkali village, Vajrapu Kotturu mandal, Srikakulam District.
12) TEPPALA RAJU, S/o. Krishna Rao, age 23 years, D.No.3-52, Rushikudda Village, Sompeta mandal, Srikakulam District.
13) GORAKALA VINAY, S/o. Dasaradhi, age 24 years, D.No.1-273, Peddha Veedhi, Kuttuma village, Kanchili mandal, Srikakulam District.
14) POTTI SURESH, S/o. not known, age 25 years, D.No.2-132 Jai Sasanam Village, Kanchili mandal, Srikakulam District.

పై నెంబరు కేసును పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంటుగా ప్రకటించమని కోరుతూ పైన పేర్కొన్న రెస్పాండెంటులపై దాఖలు చేసియున్నారు. సదరు కేసులో పిటీషనరుని ఇన్‌సాల్వెంటుగా ప్రకటించుటకు ఎవరికైననూ అభ్యంతరములు ఉన్న ఎడల ది. **20-12-2022** సం॥రం తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని **తెలియజేసుకొనవలెను.** లేనిఎడల పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

నరహరిశెట్టి రవికృష్ణ, దూళ్ల మల్లేశ్వరరావు,
ఎన్.స్వాతి రఘు బ్రహ్మ, పి.ఆదిలక్ష్మి, ఎన్.కాశివిశ్వనాథరెడ్డి,
అడ్వకేట్స్, డో.నెం.35-4-1, టెంపుల్ స్ట్రీట్, కాకినాడ.
సెల్: 94401 77599, 90101 77599

విద్యుత్ వినియోగదారుల

ఫిర్యాదుల పరిష్కార ఫోరం ఏర్పాటు

ఫోరం ఛైర్మన్ సత్యనారాయణ

మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యుత్ వినియోగదారుల, ఫిర్యాదుల సమస్యలను పరిష్కరించేందుకు వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార ఫోరం ఏర్పాటైందని ఫోరం ఛైర్మన్, జిల్లా విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ బి.సత్యనారాయణ పేర్కొన్నారు. విద్యుత్ కార్యకలాపాల ప్రచారంలో భాగంగా చట్టపరమైన అవగాహనలో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవా సదన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని ఐదు జిల్లాలోని హెచ్‌టి, ఎల్‌టి వినియోగదారుల సమస్యలను ఫోరం పరిష్కరిస్తుందన్నారు. విద్యుత్ సరఫరాలో ఎలాంటి సేవాలోపం ఉన్నా ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులను రాత పూర్వంగా ఇవ్వాలని, సర్వీసు కనెక్షన్ నంబరు, వ్యక్తి పూర్తి చిరునామా, సెల్ నంబరుతో స్వయంగా, పోస్టు ద్వారా అందజేయ వచ్చన్నారు. ఫిర్యాదుల కోసం ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. న్యాయవాదులను ఏర్పాటు చేయాల్సిన అవసరం లేదన్నారు. సరఫరాలో తరచూగా వచ్చు అంతరాయాలు, హెచ్చు, తగ్గు సమస్యలు, విద్యుత్ మీటరు ఎక్కువగా తిరగడం, ఆగిపోవడం, బిల్లులోని సమస్యలు, కొత్త సర్వీసు లు మంజూరులో జాప్యం వంటి సమస్యలను స్వీకరిస్తామని అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు జి.జ్ఞాన సువర్తరాజు, జిల్లా వినియోగదారుల ఫోరం అధ్యక్షులు ఆర్.చిరంజీవి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.పాల్గుణరావు, కార్యదర్శి ఎ.భువనేశ్వర్‌రావు, ప్రభుత్వ న్యాయవాది పొన్నాడ వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు వాన కృష్ణచంద్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు ముమ్మర చర్యలు

ఆముదాలవలస : లేఅవుట్‌ను పరిశీలిస్తున్న మెప్మా పీడీ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పొన్నాడ వద్ద నిర్మిస్తున్న జగనన్న కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. డిసెంబరు 21న సామూహిక గృహప్రవేశం చేపట్టేందుకు ఏర్పాట్లు చేపడుతున్నామని అన్నారు.

ఆముదాలవలస: వైఎస్‌ఆర్ జగనన్న కాలనీ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు ముమ్మర చర్యలు చేపట్టనున్నట్లు మెప్మా పీడీ, గ్రాజుకోల్లివలస లే అవుట్ ప్రత్యేకాధికారి ఎం.కిరణ్‌కుమార్ అన్నారు. లేఅవుట్‌లో హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. లే అవుట్ లబ్ధిదారులతో మాట్లాడి ఎస్‌హెచ్‌జి సభ్యులు, కుటుంబ సభ్యులు ఎవరైనా ఉన్నచో పావలా వడ్డీకే రూ.35 వేల అదనపు రుణాలు మంజూరు చేయిస్తామని చెప్పారు. తహశీల్దార్ వై.వి.పద్మావతి, మున్సిపల్ హౌసింగ్ ఎఇలు కె.అప్పలనాయుడు, డి.సన్యాసిరావు, మెప్మా బ్యాంకుల సమన్వయకర్త కె.సత్యనారాయణ, ఎస్.వెంకటరావు, డి.కృష్ణారావు, పి.విజయకుమారి, బి.జగన్మోహనరావు, పి.ప్రభావతి పాల్గొన్నారు.

పలాస: మండలంలోని రామకృష్ణాపురం జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలని, ఆ దిశగా త్వరితగతిన పనులు చేపట్టాలని మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన జగనన్న కాలనీని శనివారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో అతి పెద్ద జగనన్న కాలనీ పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ అని, జిల్లాలో జగనన్న కాలనీలో ఇళ్లు నిర్మాణాలు చేపట్టి గృహప్రవేశాలు జరిగే విధంగా అధికారులు చొరవ చూపాలని అన్నారు. అందుకు లబ్ధిదారులకు ఎప్పటికప్పుడు హౌసింగ్ బిల్లులు చెల్లించే విధంగా చూడాలన్నారు. మున్సిపల్, హౌసింగ్ విద్యుత్ శాఖ అధికారులు సంయుక్తంగా పనిచేస్తూ లబ్ధిదారులకు అందుబాటులో ఉండి వారి అవసరాలను తీర్చేవిధంగా అధికారుల పనిచేయాలన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ వైస్ ఛైర్మన్ మీసాల సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, హౌసింగ్ ఎఇ ధర్మేంద్రర్ పాల్గొన్నారు.

పలాస : లబ్ధిదారులతో మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు

ఇచ్ఛాపురం : హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని పురుషోత్తపురం వద్ద ఉన్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను మున్సిపల్ కమిషనర్ రమేష్, తహశీల్దార్ లావణ్య పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి తమ అవసరాలను, సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు టౌన్ ప్లానింగ్ అధికారి నారాయణరావు, మెప్మా అధికారి జనకిరామారావు, బాలరాజు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: హౌసింగ్ డే సందర్భంగా ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు, మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, తహశీల్దార్ ఈశ్వరమ్మ, గృహ నిర్మాణశాఖ డిఇ సీతారామయ్యలు కొత్తపల్లి జగనన్న కాలనీలు పరిశీలించారు. అనంతరం కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ పాపినాయుడు, విద్యుత్‌శాఖ ఎఇ సురేష్, పిఆర్ ఎఇ లత్రశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కావ్య, ఉపాధి హామీ ఎపిఒ జి.హరిప్రసాద్ పాల్గొన్నారు.

కవిటి: డిసెంబరు 21 నాటికి జగనన్న ఇళ్లు సిద్ధం కావాలని, ఆ రోజు గృహ ప్రవేశాలు జరుగుతాయని హౌసింగ్ డిఇ శేషయ్య అన్నారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఇద్దివానిపాలెం, బొరివంక గ్రామాలకు చెందిన హౌసింగ్ లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఇద్దివానిపాలెం, బొరివంక లేఅవుట్లలో 112 ఇళ్ల నిర్మిస్తున్నామని, డిసెంబరు 21 నాటికి వీటిని పూర్తి చేసేలా అందరం కలిసి పనిచేద్దాం అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, హౌసింగ్ ఎఇ సాయి కిరణ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ మోహనరావు, విద్యుత్‌శాఖ ఎఇ నేతాజీ పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని జలుమూరు, లింగాలవలస జగనన్న ఇళ్ల లేఅవుట్లను ఎంపిడిఒ జి.వి.రవికుమార్, గృహనిర్మాణశాఖ జెఇ మురళీమోహన్, మండల ఇంజినీర్ కె.శ్రీధర్ పరిశీలించారు.

ఎన్‌సిసికి 74 మంది ఎంపిక

ఎంపిక చేస్తున్న ఎన్‌సిసి అధికారులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 2022-23 విద్యా సంవత్సరంలో ఎన్‌సిసి ప్రవేశాలకు 14 ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సిసి శ్రీకాకుళంశాఖ కమెండింగ్ అధికారి కల్నల్ అమిత్ బెనర్జీ ఆధ్వర్యాన శనివారం 320 మంది విద్యార్థులకు శారీరక దారుఢ్య పోటీలు నిర్వహించారు. అందులో 74 మంది ఎంపికయ్యారని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యాస్థాయిలో ఎన్‌సిసి విభాగం ఉండడం మంచి శుభపరిణామమన్నారు. ఐటిఎమ్‌లో 2020-21 నుంచి ప్రారంభమైందన్నారు. మొదటి ఏడాది 54 మంది, రెండో ఏడాది 60 మంది, ఈ ఏడాది 74 మంది ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఎన్‌సిసిలో ప్రవేశం వల్ల విద్యార్థుల్లో దేశభక్తి, వ్యక్తిగత క్రమశిక్షణ, వ్యక్తిగత రక్షణ, శారీరక, మానసిక ఆరోగ్యం వృద్ధి చెందుతాయన్నారు. రక్షణ విభాగంలో పాటు ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల ప్రవేశంలోనూ ఉన్నత విద్యాభ్యాసంలో సైతం విద్యార్థులకు ప్రత్యేక రిజర్వేషన్లను ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సుబేదార్, పి.నాగాజీ, నాయక్ సుబేదార్ భూపేంద్రసింగ్, హవల్దార్ ఎల్.వి.రమణ, ఎన్‌సిసి డీన్ ప్రొఫెసర్ డి.విష్ణుమూర్తి, లెఫ్ట్‌నెంట్ ఆఫీసర్ బి.మురళీమోహనరావు, ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.భుజంగరావు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నాగమణి

ఆందోళన చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి- ఆముదాలవలస

అంగన్వాడీ కార్యకర్తలు ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సక్రమంగా విధులు నిర్వహిస్తున్న అధికార పార్టీ నాయకులు అకారణంగా విధుల నుంచి తొలగిస్తున్నారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి అన్నారు. పట్టణంలోని మహిళా శిశు వు అభివృద్ధి అధికారి కార్యాలయం ఎదుట సిఐటియు యూనియన్ నాయకుల ఆధ్వర్యాన అంగన్వాడీ కార్యకర్తలతో కలిసి శనివారం ఆందోళన చేపట్టారు. రాజకీయ వేధింపులను ఆపాలని, స్పీకర్ ఇలాకాలో అంగన్వాడీ కార్యకర్తలను తొలగించడం ఆమానుషం అన్యాయమని నినాదాలు చేశారు. ఆముదాలవలస సెక్టార్ పరిధిలోనే తొలగింపులు ఎక్కువగా ఉన్నాయని మండిపడ్డారు. ఆక్కా, చెల్లెమ్మలు అంటూనే... అంగన్వాడీ కార్యకర్తలపై వేధింపులకు గురిచేస్తున్నారని విమర్శించారు. నవంబరు 17న నెల్లిపర్తి-1 అంగన్వాడీ కార్యకర్త జి.పద్మను తొలగించడం దుర్మార్గమైన చర్యని అభివర్ణించారు. సెక్టార్ పరిధిలో సరుబుజ్జిలి మండలంలో మతలబుపేట, యరగాం, పర్వతాలపేట, ఆముదాలవలస మండలంలో దండేవలస, కన్నపేట గ్రామాల్లోని ఏకపక్షంగా అంగన్వాడీ కార్యకర్తలను తొలగించారని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలో అన్ని యూనియన్లతో కలిసి దశలవారీగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం సమర్పించడానికి పిఒ అందుబాటులో లేకపోవడంతో సిబ్బంది ఎవరు వినతిపత్రం తీసుకోవడానికి ముందుకు రాలేదు. అనంతరం గది తలుపునకు వినతిపత్రాన్ని అంటించి వెనుదిరిగారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రజాతంత్ర జిల్లా మహిళా కన్వీనర్ ఎ.లక్ష్మి, సిఐటియు మండల అధ్యక్షులు పంచాది లతాదేవి, కె.జ్యోతి, ఎ.సరస్వతి, ఎ.రమణమ్మ, మొదలవలస లత, బి.సునీత, ఎ.అరుణ పాల్గొన్నారు.

తొలగించిన పునాదులను పరిశీలిస్తున్న గణపతి

పునాదుల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో పేదల ఇళ్ల పునాదులు తొలగించడం అన్యాయమని, పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటాలు చేస్తామని సిపిఎం నాయకులు ఎన్.గణపతి అన్నారు. కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో పేదల ఇళ్ల పునాదులు తొలగించడంపై శనివారం పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆమ్మవారి ఆలయం కోసం పేదల ఇళ్ల పునాదులు తొలగించి వారిని ఇబ్బందులు చేయడం తగదన్నారు. కొంతమంది లక్షల రూపాయలతో స్థలాలు కొనుగోలు చేసుకున్నారని, మరికొంతమంది పునాదులు వేసుకున్నారని, వారికి ఎటువంటి సమాచారం లేకుండా రాత్రి రాత్రి యంత్రాలతో పునాదులను ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలకులు, అధికారులు చొరవ చూపి వారికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు బాధితులు కృష్ణారావు, నాగావ వీరాస్వామి, పి.రమేష్, బి.గోపి, ఎం.నిర్మలలు ఉన్నారు.

అభియోగాలను కప్పిపుచ్చుకోవడానికే...

మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇంటా, బయటా అభియోగాలను కప్పి పుచ్చుకోవడానికే రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు నిజాయితీ అని మాట్లాడుతున్నారని, ఆయన మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించే రీతిలో ఉన్నాయని మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ అన్నారు. అరసవల్లిలోని ఆయన స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఆధికార దుర్వినియోగానికి తాను పాల్పడనని, 80 అడుగుల రోడ్డులో తనకు ఒక్క సెంటు భూమి కూడా లేదని చెప్పడంలో నిగూఢ రహస్యం దాగి ఉందన్నారు. పొరపాట్లను సరిదిద్దు కుంటానని చెప్పుతున్న ధర్మాన తన పాలనాకాలంలో చేసిన తప్పిదాలను సుదీగా బహిరంగపరిస్తే సరిదిద్దు కోగలరా? అని ప్రశ్నించారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, తానేదో 80 అడుగుల రోడ్డు అభివృద్ధి చేశానని చెప్పడం చూస్తే ప్రజలను తప్పుదోవ పట్టించడమే అవుతుందని అన్నారు. రోడ్డు నిర్మాణం తర్వాత విద్యుద్దీకరణ పనులు, ఇరువైపు లా మొక్కలు నాటింది మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి కాదా? అని ప్రశ్నించారు. అలాగే మహిళా కళాశాల రోడ్డు విస్తరణ టిడిపి హయాంలోనే చేపట్టామన్నారు. సమావేశంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్ పాల్గొన్నారు.

ఐదు తాలూకా కమిటీలు ఏకగ్రీవం

ఎన్‌జిఒ రాష్ట్ర సహాధ్యక్షులు పురుషోత్తంనాయుడు

టెక్కలి : నియామకపత్రాలను అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, టెక్కలి, కోటబొమ్మాళి తాలూకా యూనిట్లకు ఆయా తహశీల్దార్ కార్యాలయాల వద్ద నామినేషన్ల స్వీకరణ చేపట్టామని, ఈ ఐదు చోట్ల కార్యవర్గం లోని 11 పదవులకు ఏకగ్రీవంగా ఎన్నికైందని, తాలూకా కమిటీల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఎన్‌జిఒ సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు చౌదరి పురుషోత్తంనాయుడు, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం తెలిపారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12వ పిఆర్‌సిని అనుకున్న రీతిలో సాధించేందుకు సంఘం పోరాడుతుందని అన్నారు. మలివిడత ఎన్నికలకు గోవింద్ పట్నాయక్, చల్లా శ్రీనివాస రావు, జయరావు, రాధాకృష్ణ, డి.శ్రీనివాస్, సహాయ ఎన్నికల అధికారులుగా బడగల పూర్ణచంద్రరావు, నవీన్, భరద్వాజ్, మనోహర్, మోహనరావులు వ్యవహరించారని తెలిపారు.

టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ల సాధనకు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని, ఈ క్రమంలో ఎల్లతాటిపై ఉద్యోగుల ఉండి సమస్యలు సాధనకు సిద్ధం కావాలని ఎపిఎన్‌జిఒ రాష్ట్ర సహాయ కార్యదర్శి కార్యదర్శి చౌదరి పురుషోత్తంనాయుడు పిలుపునిచ్చారు. టెక్కలి మండల సంఘం ఎన్నికలు శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు కొద్ది నెలల నుంచి డిఎ, ఎరియర్స్ వంటి ఉద్యోగుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ ఉద్యోగుల సమస్య సాధనలో మిగిలిన సంఘాలతో కలిసి ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా సంపతరావు మోహనరావు, అసోసియేట్ అధ్యక్షులుగా పి.సి.నందా, ఉపాధ్యక్షులుగా ఆర్.సుబ్రహ్మణ్యం, చమర్ల మధుబాబు, పి.సంధ్యారాణి, కార్యదర్శిగా బి.లక్ష్మణరావు, కార్యదర్శులుగా కె.వెూతుబాబు నాయుడు, పసుపురెడ్డి వాసుదేవరావు, కె.శివకుమార్, యర్ర వనజాక్షి, కోశాధికారిగా పి.మన్మథరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పలాస : ఎపిఎన్‌జిఒ మండల శాఖ అధ్యక్షులుగా బోనేల గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల నూతన కమిటీ ఎన్నిక శనివారం నిర్వహించారు. ఎపిఎన్‌జిఒ రాష్ట్ర ఉ పాధ్యక్షులు పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్షులు సాయిరాం ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా దుర్గాప్రసాద్ పట్నాయక్, వైస్ ప్రెసిడెంట్ పొట్నూరు శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్-2 ఆండ శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్ శ్రీగౌరి రాజా, సెక్రటరీ బొంతల ఉపేంద్రరావు, జాయింట్ సెక్రటరీ బూర్లె సంతోష్‌కుమార్, జాయింట్ సెక్రటరీ-2 ఉదయ్ శంకర్ పాత్రో, జాయింట్ సెక్రటరీ-3 కంచరాన చాణిక్య, జాయింట్ సెక్రటరీ ఉమెన్ వలుసాపల్లి త్రివేణి, ట్రెజరర్ నీలాపు ఉపేంద్ర రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన సభ్యులకు ఎంపిడిఒ ఎన్. రమేష్ నాయుడు పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం తాలూకాకు చెందిన ఎపి ఎన్‌జిఒ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఎన్‌జిఒ జిల్లా సెక్రటరీ చల్లా శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండల కమిటీ అధ్యక్షులుగా కంచరాన శ్రవణ కుమార్, కార్యదర్శిగా ఎస్.కృష్ణ, ఉప అధ్యక్షులుగా కృష్ణ, కె.శ్రీనివాసరెడ్డి, ఎన్.మల్లేశ్వరరావు, జాయింట్ సెక్రటరీలుగా బి.నీలవేణి, వి.ప్రవీణ్, పి.వాణి, రోషినిపట్నాయక్, కోశాధికారి పవన్‌కుమార్ ఎన్నికయ్యారు.

పాత్రికేయుల సంక్షేమానికి రాజీ లేని పోరు

జాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యుగంధర్ రెడ్డి

పళ్లు పంపిణీ చేస్తున్న జాప్ సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ఒకే ఒక్క జాప్ కార్యకలాపాలను నిర్వహిస్తుందని, పాత్రికేయుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.యుగంధర్ రెడ్డి అన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో జాప్ జిల్లా అధ్యక్షులు జి.షణ్ముఖరావు అధ్యక్షతన జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 30వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ముందుగా కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఎపిహెచ్‌బి కాలనీలోని బెహరా మనోవికాస్ కేంద్రంలోని చిన్నారులకు పళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి, కె.వేణుగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.లక్ష్మణరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కన్వీనర్ శాసపు జోగినాయుడు, జాప్ జిల్లా కార్యదర్శి డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా, రౌతు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పనులు పరిశీలన

సోంపేట : మండలంలోని పలాసపురంలో చేపడుతున్న విద్యుత్ పనులను స్థానిక సర్పంచ్ తడక జోగారావు పర్యవేక్షించారు. రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలు లైన్లను చేపట్టారు. విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సాయిబాబా జయంతి

మెళియాపుట్టి : మండలంలోని చాపరలో ఉన్న భగవాన్ సత్యసాయి భజన మండలి ఆధ్వర్యాన సాయిబాబా 97వ జయంతి వేడుకలు శనివారం నిర్వహించారు. నగర సంకీర్తన, లలితా సహస్ర నామావళి, కుంకుమార్చన వెయ్యి ఎనిమిది దీపాలతో లింగార్చన కార్యక్రమాలు నిర్వహించారు. కన్వీనర్ కిల్లంశెట్టి పారినాథరావు, శిఖిభూషణ్, కృష్ణ, పోలినాయుడు, మోహన్ పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిషోర్ చంద్రదేవ్ సతీసమేతంగా శనివారం అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో విశిష్ట సేవలు నిర్వహించిన స్వామి వారి శేషవస్త్రాన్ని ఇప్పిలి శంకరశర్మ అందజేశారు.

సచివాలయాల సందర్శన

ఫిర్యాదును స్వీకరిస్తున్న పిఒ నవ్య

సంతృప్తికరంగా లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయాలపై పర్యవేక్షణ కొరవడిందని ఎంపిడిఒ సురేష్‌కుమార్‌పై మండిపడ్డారు. ఇళ్ల నిర్మాణం వేగవంతంపై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒను ఆదేశించారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బూర్జ : రికార్డులను సక్రమంగా నిర్వహించకపోతే సహించేది లేదని సీతంపేట ఐటిడిఎ బి.నవ్య హెచ్చరించారు. మండలంలోని కొల్లివలస, నీలాదేవిపురం, బూర్జ, ఎ.పి.పేట గ్రామాల్లోని సచివాలయాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సర్వేస్ రికార్డులు గృహ నిర్మాణాల వివరాలను, సచివాలయ సిబ్బంది హాజరును చలాన రిజిస్టర్లను పరిశీలించారు. హాజరు

ఇచ్ఛాపురం : మండలంలో ఈదుపురం సచివాలయంలో సిబ్బంది పనితీరు మెరుగుపర్చుకోవాలని ఎంపిడిఒ రామారావు అన్నారు. ఈ మేరకు సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. బూర్గపాడులో గృహ నిర్మాణాలపై తహశీల్దార్ లావణ్య అధికారులతో సమీక్షించారు.

శివాలయంలో చోరీ

ప్రజాశక్తి- పోలాకి

మండల కేంద్రంలోని వెదుళ్లవలసలో ఉన్న విశ్వేశ్వరస్వామి శివాలయములో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చొరబడి వెండి ఆభరణాలు దొంగిలించారు. శనివారం ఉదయం ఆలయ పూజారి వచ్చి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి స్థానికుల సహకారంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ తాళాలు, గర్భగుడి తాళాలు బద్దలుకొట్టి విగ్రహాలకు అమర్చిన వెండి కళ్లు, వెండి కిరీటాలు, వడ్డాణం అన్నీ వస్తువులు కలిపి 250 గ్రాములు దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. అలాగే క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు. ఆలయ అర్చకులు అప్పిని శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరసింహమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాటుసారా ప్యాకెట్లు పట్టివేత

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ నేతాజీనగర్ కాలనీలో ఎస్ఇబి గోవింద శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మజ్జి వీరన్న అక్రమంగా విక్రయిస్తున్న గుర్తించి ఆయన వద్ద నుంచి 20 నాటుసారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివరాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఇంటి వద్దకే వైద్య సేవలు

పొందూరు: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఇంటివద్దనే వైద్యసేవలను అందించడం ఎంతో ప్రయోజనం కలుగుతుందని వైద్యాధికారి శివశంకర్ అన్నారు. మండలంలోని రాపాకలో హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో శనివారం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బెడ్‌రెడ్, గర్భిణులు, బాలింతలు, బిపి, షుగర్, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న వారి ఇంటికి వెళ్లి ప్రత్యేకంగా వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి బి.సత్యసాయికుమార్, ఎంఎల్‌హెచ్‌పి లావణ్య జ్యోత్స్న, ఎఎన్ఎంలు ఉదయలక్ష్మి, వనజాక్షి, హెల్త్ అసిస్టెంట్ రమణ, డిఇఒ శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, లక్ష్మి, ఉష, పుణ్యవతి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రభాకరరావు

పొందూరు: పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకరరావు పేర్కొన్నారు. మండలంలోని వావిలపల్లిపేట వద్ద గల ఆదర్శ పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందించేందుకు మండలిస్తామే తప్ప మరే ఉద్దేశం ఉపాధ్యాయులకు ఉండదన్నారు. పదో తరగతి విద్యార్థులకు రోజూ సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని, తప్పనిసరిగా హాజరయ్యేలే చూడాలని సూచించారు. పాఠశాల మెూనటరింగ్ కమిటీ లేకపోవడంతో మౌలిక వసతుల కల్పన, నిర్వాహణకు ఇబ్బందిగా ఉందని, పాఠశాల అభివృద్ధికి తల్లిదండ్రుల ఆర్థిక తోడ్పాడు అందించాలని కోరారు. దీంతో పలువురు తల్లిదండ్రులు ముందుకొచ్చారు. పాఠశాలలో పూర్తిస్థాయిలో నీటిసౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు చెరువులకు వెళ్లాల్సి వస్తోందని, ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, విద్యార్థులు బయటకు వెళ్లకుండా చూడాలని పలువురు తల్లిదండ్రులు కోరారు. పూర్తిస్థాయిలో నీటి సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని ప్రిన్సిపాల్ తెలిపారు.

విద్యార్థులకు అభినందనలు

అభినందనలు తెలుపుతున్న ప్రిన్సిపాల్ ప్రవీణ

ప్రజాశక్తి- పోలాకి

విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగి ఉండాలని ఎపి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ సూచించారు. ఎపి మోడల్ స్కూల్లో చెకుముకి ఆటలు పోటీల్లో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులు గొలివి ప్రేమ సఖి, పల్లి బోస్ కార్తికేయ, బొడ్డేపల్లి శ్రుతిలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి శివరామిరెడ్డి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో శాంతిభద్రతలను పరిరక్షణలో పోలీస్ పాత్ర కీలకమని కాశీబుగ్గ డిఎస్‌పి శివరామిరెడ్డి అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ సందర్శించి పలు రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో కీలక పాత్ర వహించాలని, అలాగే పలు సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కక్షిదారులతో స్నేహభావంతో మెలగాలన్నారు. గ్రామాల్లో దిశ యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయనతో పాటు టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, స్థానిక ఎస్ఐ షేక్‌ఖాదర్‌బాషా ఉన్నారు.

ఆదర్శప్రాయులు ఇందిరాగాంధీ

ఆముదాలవలస : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి ఇందిరాగాంధీ అని డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అన్నారు. మాజీ ప్రధానమంత్రి జయంతి సందర్భంగా పట్టణంలోని గేట్ వద్ద ఉన్న ఇందిరా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరాగాంధీ పాలనలోనే దేశాభివృద్ధికి బాటలు వేశారని అన్నారు. దేశవ్యాప్తంగా ఇళ్ల లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేసి పక్కా ఇళ్లను నిర్మించిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. భూమిలేని నిరుపేదలకు భూములను పంచి నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని ఆమె సేవలను కొనియాడారు. దేశానికి 16 ఏళ్ల పాటు ప్రధానమంత్రిగా పనిచేసి విప్లవాత్మకమైన సంస్కరణలను తీసుకువచ్చారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి బొడ్డేపల్లి గోవిందగోపాల్, సనపల అన్నాజీరావు, బస్వా షణ్ముఖరావు, బొత్స రమణ, ఊసా రమణ, లఖినేని సాయి పాల్గొన్నారు.

పలాస: మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీని ప్రతి మహిళా ఆదర్శంగా తీసుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, మదర్ తెరిసా పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగా భవాని అన్నారు. పలాస మదర్ తెరిసా పాఠశాలలో అంతర్జాతీయ మెన్స్ డేతోపాటు, మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 105 జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరాగాంధీ అడుగుజాడల్లో నడవాలని, ఆమెను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు అధిరో హించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం బాబూరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ప్రసాదరావు, సమన్వయకర్త చంద్రమౌళి, జగదీష్ పండా, సెుమలపు సుశీలారావు, జోగారావు, కూర్మారావు, కిషోర్ పండా పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక ఇందిరాగాంధీ కూడలి వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూదనరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం సీనియర్ నేతలను కోత చిన్నబాబు, పొట్నూరు రామునాయుడు, రిక్కు సూర్యకుమారి, బమ్మిడి ముఖలింగం, తంగుడు

బాబూరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అప్పారావు, మురళిలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అధికార ప్రతినిధి పేడాడ పరమేశ్వరరావు, టెక్కలి ఇన్‌చార్జి చింతాడ దిలీప్, బిసి సెల్ రాష్ట్ర అధ్యక్షులు సనపల అన్నాజీరావు, మహిళా అధ్యక్షులు లలితాకుమారి, బమ్మిడి లక్ష్మీపతి, చింతాడ పార్వతీశం, శాసుమామిడి ధర్మారావు, నరసింగరావు పాల్గొన్నారు. అనంతరం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు.

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో వివిధ ప్రభుత్వ గ్రాంట్లు, జనరల్ ఫండ్స్‌తో చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆదేశించారు. నగర శివారు పెద్దపాడులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో శనివారం సమీక్షించారు. నగరపాలక సంస్థకు 14,15 ఆర్థిక సంఘం నిధులు, అర్బన్ హెల్త్ సెంటర్స్, స్వచ్ఛాంధ్రా కార్పొరేషన్ నిధులు, గడప గడపకు ప్రభుత్వం నిధులు మంజూరు పనులు వేగవంతం చేయాలన్నారు. కొన్ని పనులు సగంలోనే నిలిచిపోవడానికి కారణాలు తెలపాలని కోరారు. సకాలంలో పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తయిన పనులు వెనువెంటనే రికార్డు చేసి బిల్లులు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి 15 రోజులకొకసారి పనులపై సమీక్షించాలన్నారు. అనేక చోట్ల కాలువల్లో పూడికతీత పనులు చేపట్టిన తర్వాత తిరిగి పలకలు వేయడం లేదని, వీటివల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. అవసరమైన ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకు కమిషనర్, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ ఇంజినీర్ గంగాధర్, చల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం

నగరంలోని వివిధ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నలింగ్ పాయింట్స్‌ను రెవెన్యూ మంత్రి ప్రారంభించారు. పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని సిగ్నలింగ్ వ్యవస్థ మెరుగుపర్చుకోవడం ద్వారా ట్రాఫిక్ నియంత్రణకు దోహదపడతాయన్నారు. నగరంలోని పొట్టి శ్రీరాములు, డే అంట్ నైట్, రామలక్ష్మణ, పసగాడ సూర్యనారాయణ మిల్, కృష్ణాపార్కు కూడళ్లు, బలగ మెట్టు వద్ద సిగ్నల్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, కమిషనర్ ఓబులేసు, ట్రాఫిక్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజు

'అరబిందో' అభివృద్ధికి తోడ్పడాలి

ప్రజాశక్తి - రణస్థలం

అరబిందో పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడాలని ఆ సంస్థ కార్పొరేట్ హెచ్‌ఆర్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యు.ఎన్.బి.రాజు పిలుపునిచ్చారు. స్థానిక అరబిందో పరిశ్రమలో కాంట్రాక్టర్లు, కాంట్రాక్టు అసోసియేషన్ సభ్యులు, కార్మికులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల నిర్వహించబడిన అనేక రెగ్యులేటరీ, కస్టమర్ ఆడిట్లు విజయవంతమైందన్నారు. కోవిడ్ తదనంతరం అనేక రంగాలతో పాటు ఫార్మా పరిశ్రమ ఎదుర్కొన్న ఒడిదుడుకులను వివరించారు. ప్రస్తుతమూ అటువంటి క్లిష్టపరిస్థితులే కొనసాగుతున్నాయని విశదీకరించారు. ముడి సరుకుల ధరలు, అంతర్జాతీయ విపణిలో రూపాయి డాలరు మారకం విలువల అంతరాలు, విపరీతంగా పెరిగిన ఉత్పత్తి వ్యయం, రవాణా తదితర సంబంధిత ఖర్చులు దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ విపణిలో కూడా అరబిందో పరిశ్రమపై తీవ్రమైన దుష్ప్రభావం పడిందని వివరించారు. ఇటువంటి పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రతిఒక్కరూ ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచు దిశగా, ఉత్పత్తి వ్యయం తగ్గించేందుకు వీలైనంతవరకు స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పరిశ్రమ హెచ్ ఆర్ అండ్ అడ్మిన్ కె.కమలాకర్ రెడ్డి, పి.తిరుమలరావు, పి.గౌరీశంకర్ కుమార్, డి.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

ధైర్యం, సమయస్ఫూర్తి, దేశంపై అంకిత భావం, సుదీర్ఘ కాలం పాటు ఇందిరాగాంధీని దేశ ప్రధానమంత్రిగా నిలిపిందని, ఆమె సేవలు చిరస్మరణీయమని ఎస్‌పి జి.ఆర్.రాధిక కొనియాడారు. నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ చైర్‌పర్సన్ సువ్వారి సువర్ణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో ఆమె హాజరై మాట్లాడారు. మహిళల అభ్యున్నతికి ఆమె ఎంతగానో కృషి చేశారని గుర్తు చేశారు. రాజకీయంగా ఎన్ని ఇబ్బందులు వచ్చిన మొక్కవోని ధైర్యంతో దేశాన్ని సమర్థవంతంగా పాలించారన్నారు. గ్రంథాలయాల ప్రాముఖ్యను ఆమె వివరిస్తూ... ప్రతిఒక్కరూ పుస్తకాలు చదవడం అలవాటుగా మార్చుకోవాలన్నారు. వినోదం, విజ్ఞానంతో పాటు చదువుపై ఆసక్తి పెరగాలంటే ప్రతినిత్యం గ్రంథాలయాలను సందర్శించాలన్నారు. అనంతరం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు పి.సురేఖ, జి.స్వరాజ్యలక్ష్మి, హేమలత, సువ్వారి సత్యనారాయణ, సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా పాల్గొన్నారు.

కవిటి గ్రంథాలయంలో ఎంపిపి ఎంపిపి స్కూల్ హెచ్‌ఎం వరలక్ష్మి ఆధ్వర్యాన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని సందర్భంగా మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. అనంతరం నేటి సమాజంలో మహిళల పాత్ర - ఆవశ్యకత అనే అంశంపై చర్చించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పూర్ణచంద్రబెహరా, ఉపాధ్యాయులు శిరీష, సిఆర్‌పిలు తనూజ, మహేష్, భరత్, రాము, సాయి, లోకేష్ పాల్గొన్నారు.

మురపాక గ్రంథాలయంలో శ్రీకాకుళం పట్టణానికి చెందిన ఎం.డి.ప్రసాద్ చేసిన మ్యాజిక్ షో విద్యార్థులను ఆకట్టుకుంది. రుమాలను పువ్వులుగా మార్చడం, పదునైన కత్తిని కంఠంలో త్రోయ్యడం, దీపాలను వెలిగించి వాటిని పువ్వులుగా తీయడం, కాగితాలను రూపాయి నోట్లుగా మార్చడం, చిన్న పెట్టిలో రోమాలు వేసి జాతీయ పతాకాన్ని తీయడంతో పాటు 30 ఐటమ్స్ చేసి చూపించారు. అలాగే మాట్లాడే బొమ్మ ద్వారా విద్యార్థులందరినీ నవ్వించారు. అనంతరం ప్రసాద్‌ని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, హైస్కూల్ హెచ్‌ఎం ఎం.అరుణ దుశ్శాలువ కప్పి సన్మానించి జ్ఞాపకను అందజేశారు. స్థానిక సర్పంచ్ పెయ్యల నాగమణి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

పలాస గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి ఎంపిడిఒ కార్యాలయం సూపరింటెండెంట్ అనురాధ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వై.రాంబాబు, ఉష, జి.రోజా, బి.మంగవతి, పి.హేమంత్, తేజేశ్వరరావు పాల్గొన్నారు.

పొందూరు శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి.వి.భాస్కరరాజా ఆధ్వర్యాన ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం మానసవేణి పాఠశాల ఉపాధ్యాయురాలు లక్ష్మీరాజ్యం అధ్యక్షతన విద్యార్థినులకు రంగవల్లికల పోటీలను నిర్వహించారు.

పోలాకి శాఖాగ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పోలాకి సర్పంచ్ మజ్జి రమణమ్మ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం గ్రంథాలచాధికారి కె.మానస ఆధ్వర్యాన సర్పంచ్‌ను సన్మానించారు.

టెక్కలి గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి ఎన్.రామారావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పి.సుదర్శనరావు, హనుమంతు వినయ్‌కుమార్, ఉదయ్‌కిరణ్, అమ్మనమ్మ, రాజేష్ పాన్నారు. అదే విధంగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఇందిరాగాంధీ చిత్రటానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కళాశాల ఆధ్యాపకులు బేవల సతీష్‌కుమార్, జాతీయ సేవా పథకం పిఒలు వి.లూక్‌పాల్, కంది గోళ్ల, డాక్టర్ జగన్నాథరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం శాఖాగ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి పూర్ణచంద్ర బెహరా పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం విద్యార్థినులకు రంగవల్లిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు వాసు, లత, గణేష్ ,గణపతి పాల్గొన్నారు.

సంతబొమ్మాళి గ్రంథాలయంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి ఎంపిడిఒ జి.ఉమాసుందరి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఇందులో భాగంగా సచివాలయ మహిళా పోలీసులు శ్రావణి, సుజాత దిశ చట్టంపై విద్యార్థినులకు వివరించారు.

కొత్తూరు ఎంపిపి స్కూల్‌లో గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులను గ్రంథాలయాధికారి టి.ఇందిర అందజేశారు.

సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రంగవల్లులు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించామని ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు ఆధ్వర్యాన నిర్వహించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలైన ఊర్మిళ, రామశంకర్, చాందినీ, సాయిరాజు, రిషిత, డేవిడ్ కుమార్, స్వాతి, వాణి, మోహిని, చాందినీలను కళాశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో కళాశాల లైబ్రేరియన్ ఆకెళ్ల రామారావు, ఎన్‌ఎస్‌ఎస్ పిఒ దుగ్గివలస రాంప్రసాద్ అధ్యాపకులు ధనుంజయరావు, రమేష్ సాహూ, శ్రీనివాసరావు, సంగీత అప్పలనాయుడు, సరుబుజ్జిలి శాఖాగ్రంథాలయాధికారి ఉగ్రసేన్ పాల్గొన్నారు.

సోంపేట మహర్షి విద్యానికేతన్‌లో పాఠశాల డైరెక్టర్ శకుంతల ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఆమదాలవలస గ్రంథాలయంలో గ్రంథాలయం అధికారి అన్నెపు కోటేశ్వరరావు విద్యార్థినులకు రంగవల్లిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని మున్సిపల్ హైస్కూల్ గేటు విద్యార్థినులు, ద్వితీయ బహుమతిని మెట్టక్కివలస హైస్కూల్ విద్యార్థినులు, తృతీయ బహుమతిని కొర్లకోట జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులు గెలుపొందారు.

జి.సిగడాం శాఖాగ్రంథాలయంలో గ్రంథాలయాధికారి వై.అమర్నాథ్ ఆధ్వర్యాన ఇందిరాగాంధీ జయంతి ఉత్సవాలను న్విహించారు. జిల్లా పరిషత్ ఉన్నత, కెజిబివి, మోడల్ స్కూల్ నుంచి 75 మంది విద్యార్థులు రంగువల్లికల పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మణ్, ఈశ్వరరావు, లక్ష్మి, దుర్గారావు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

చంద్రబాబుకు చెప్పు దెబ్బలు తప్పవు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మూడు రాజధానులకు మద్దతు పలుకుతున్న వారిపై చెప్పు చూపించాలని ఉందంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాడు చేసిన ప్రేలాపనలు తీవ్ర ఆక్షేపణీయమని, చెప్పుదెబ్బలు తినడానికి అర్హుడు చంద్రబాబేనని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. టెక్కలి దివ్వెల మాధురి స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. చెప్పుల రాజకీయాలతోనే చంద్రబాబు దొడ్డిదారిన ముఖ్యమంత్రి అయిన విషయం తెలుగు ప్రజలందరికీ తెలుసన్నారు. కర్నూలు పర్యటనలో అధికార వికేంద్రీకరణకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఆయనను ప్రజలు ప్రశ్నించారని అన్నారు. ఈయనతో పాటు సర్పంచ్ గొండెలి సుజాత, ఉపసర్పంచ్ గండి విశ్వశాంతి, మండల మహిళా విభాగం అధ్యక్షులు దివ్వెల మాధురి, పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన చంటి, వారణాసి గోవిందరావు, బగాది హరి, సాబ పాల్గొన్నారు.

కంచిలి : తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతో సహా ఆ పార్టీ నేతలకు అసలు సంస్కారం ఉందా? అని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ప్రశ్నించారు. ఎంపిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు.కర్నూలు సభలో చంద్రబాబు మాట్లాడిన మాటలను చూస్తే ఆయనకు సంస్కారం ఉందా? అనిపిస్తుందన్నారు. నేను రౌడీని, ఒక్కొక్కరికి చొక్కాలు విప్పి కొడతాననడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చంద్రబాబు మాటలను వైసిపి తరుపున ఖండిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ నర్తు రామారావు, ఎంపిపి పైల దేవదాస్ రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మడి రాందాస్, మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, పలికిల జయరాం, గొనప సింహాచలం, యారడి ఆనందరావు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

సిఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

ఆమదాలవలస : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సిఎంకప్ క్రీడా పోటీలకు సంబంధించి నియోజకవర్గ స్థాయిలో క్రీడాకారుల ఎంపిక పోటీలను వైసిపి యువనేత తమ్మినేని వెంకట చిరంజీవినాగ్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, బొడ్డేపల్లి రమణమూర్తి, ముడడ్ల రమణ పాల్గొన్నారు.

ముత్యాలపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు

ఇంటింటికీ తాగునీరు

ప్రజాశక్తి- కవిటి

జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందజేస్తున్నామని బొరివంక సర్పంచ్ బి.శ్రీరామ్‌ప్రసాద్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు పులకల శ్రీరాములు తెలిపారు. మండలంలోని బొరివంక, కపాసుకుద్ది పంచాయతీ ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జలజీవన్ మిషన్ కార్యక్రమంపై శనివారం గ్రామసభ, అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 నాటికి ఇంటింటికీ సురక్షిత తాగునీటి కుళాయి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. 50 శాతం మహిళలు, 25 శాతం పంచాయతీ మెంబర్లు, 25 శాతం వెనుకబడిన తరగతుల కలయికతో ఈ కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్టు జలజీవన్ మిషన్ ఇచ్ఛాపురం సబ్ డివిజన్ టీమ్ లీడర్ జె వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో బొరివంక ఎంపిటిసి డి.సతీష్, మాజీ ఎంపిటిసి బి విజయ్, పంచాయతీ కార్యదర్శి గుణవతి, కపాసుకుద్ది ఉప సర్పంచ్ పి.చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తమ్మయ్య, బాలక శ్రీనివాస్, రాంబాబు, జలజీవన్ మిషన్ సభ్యులు హారిక, సుధీర్, భాగ్యలక్ష్మి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద తొమ్మిది మంది బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ రూ.14.82 లక్షల చెక్కులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు ఎచ్చెర్ల నియోజకవర్గంలో సిఎం రిలీఫ్ కింద మొత్తం 257 మందికి రూ.2, 41,46,500 బాధితులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మహంతి పెద్దరామునాయుడు, మీసాల రామారావు, నక్క కృష్ణమూర్తి, అంబటి శ్రీనివాసరావు, శేష సూర్యనారాయణ, ముద్దాడ శంకర్, పాల రామసూరి, కొల్లి ఈశ్వరరావు, ఆళ్ల కృష్ణ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ పంపిణీ

టెక్కలి రూరల్ : మండలంలోని సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను శనివారం పంపిణీ చేశారు. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ముఖ్యమైన కెనరా బ్యాంకు 117వ వార్షికోత్సవ సందర్భంగా కెనరా విద్య జ్యోతి స్కాలర్‌షిప్ పేరుట 5,6,7 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.2,500 చొప్పున, అలాగే 8,9,10 తరగతుల విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున అందజేశామని టెక్కలి కెనరా బ్యాంకు మేనేజర్ ఎం.తిరుమలరావు చెప్పారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ సిబ్బంది ధనుంజయ్‌రావు, దిలీప్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తారు వేణికుమారి పాల్గొన్నారు.

విశాఖ రాజధాని కోరుతూ తీర్మానం

నందిగాం: విశాఖ పరిపాలన రాజధాని కావాలని కోరుతూ నందిగాం మండల సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ మేరకు విశాఖను పరిపాలన రాజధాని చేయాలని కోరుతూ తెంబూరు ఎంపిటిసి లవునిపల్లి ధనరాజ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టగా, అధికారులు, ప్రజాప్రతినిధులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కళింగ కార్పోరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో విశాఖను పరిపాలన రాజధాని చేయడానికి ప్రతిపాదించారని అన్నారు. దీనికి అధికారులు, ప్రజాప్రతినిదులంతా మద్దతుగా నిలిచి విశాఖ రాజధాని సాధనకు ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

గూడతో నీటిని తోడుతున్న రైతన్న

చివరి ప్రయత్నానికి నీటి కష్టాలు

వజ్రపుకొత్తూరు: సాగునీటి కోసం రైతులు పడుతున్న కష్టాలకు అద్దం పడుతుంది ఈ చిత్రం. శనివారం సీతాపురంలో రైతులు పంటను కాపాడుకోవడానికి చేస్తున్న చివరి ప్రయత్నాలు. ఖరీఫ్ వరి పంట చివరి దశలో సాగునీటి కష్టాలు రైతులను వెంటాడుతుంది. పంట చేతికి అందే సమయంలోనే పంటకు నీరు తడులు లేక రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. వంశధార శివారు భూముల రైతులు మూడేళ్లుగా సక్రమంగా సాగునీరు సరఫరా లేకపోవడంతో వరుసగా కరువు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. 60 ఆర్ఎల్ 5 ఎల్ బెండి పరిధిలో వరుస కరువు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంశధార సాగునీరు అందించకున్నా నీటితీరువా వసూలు చేయడం దారుణం అని రైతులు వాపోతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో ఇబ్బందులు ఎదురైనా గత సెప్టెంబరులో కురిసిన వర్షాలతో చెరువులు నిండాయి. సీతాపురం ఎర్ర చెరువు, పెద్దబొడ్డపాడు రామసాగరంలో నీరు పూర్తిగా అడుగంటింది. చెరువుకి సమీపంలో ఉన్న రైతులు గూడలతో నీరు తోడుకొని పొలాలకు పెడుతున్నారు. పంటను బతికించుకోడానికి ఇంతకంటే మార్గం కనిపించడం లేదని పేర్కొంటున్నారు. మూడు రోజుల్లో వంశధార శివారు ప్రాంతానికి సాగునీరు అందిస్తామని అటు ప్రజాప్రతినిధుల నుంచి, ఇటు అధికారుల వరకు ఇచ్చిన హామీలు నీటి మూటలుగానే మిగులుతున్నాయని రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ సమయంలో వంశధార నీటితో శివారు ప్రాంతంలోని రామసాగరం, ఎర్ర చెరువులను నింపితే 600 ఎకరాల్లో పంట చేతికి వస్తుందని, లేదంటే రైతుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరు అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంక్షిప్త వార్తలు

మహిళలతో మాటామంతి

ఆమదాలవలస : 'ఏం కొనేటట్టు తినేటట్టు వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు లేకుండాపోయిందని' జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత అన్నారు. పురపాలక సంఘంలోని 10వ వార్డు పరిధిలోని వాంబే కాలనీ, హడ్కో కాలనీ, గాంధీనగర్, మండల వీధి, కంద్రిపేటల్లో మహిళలతో మాట మంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. హడ్కో కాలనీ వద్ద బజ్జీలను అమ్మే మహిళను గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా ఏమిటని అడిగారు. గత ప్రభుత్వంలో కరెంట్ బిల్లు రూ.200 వచ్చేదని, ఇప్పుడు అదే ఇంటికి రూ.800 వస్తుందని వాపోయింది. గ్యాస్ బండను రూ.1150కు, నూనె ప్యాకెట్‌ను రూ.160 కొంటున్నామని వివరించారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి మహిళా అధ్యక్షులు బోయిన సునీత, మాజీ కౌన్సిలర్లు తమ్మినేని విద్యాసాగర్, ఇంజరాపు విశ్వనాథం, సంపదరావు మురళి, గుడ్ల రాజ్యలక్ష్మి, రాడ విజయ్ కుమార్, నాగళ్ల మురళి పాల్గొన్నారు.

రేపు వైసిపి విస్తృతస్థాయి సమావేశం

నరసన్నపేట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి ఈ నెల 23న జిల్లాకు వస్తున్న నేపథ్యంలో వైసిపి విస్తృతస్థాయి సమావేశాన్ని ఈ నెల 21న నిర్వహిస్తున్నామని జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. నరసన్నపేటలోని ఎస్‌విఎల్ఎన్ కళ్యాణ మండపంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశానికి విద్యాశాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లాలోని ఎమ్మెల్యేలు, జెడ్‌పి చైర్‌పర్సన్, డిసిసిబి, డిసిఎంఎస్ చైర్‌పర్సన్లు, ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొంటారని చెప్పారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు.

జేజమ్మకు ఆర్థికసాయం

నందిగాం: టెక్కలి మండలానికి చెందిన నంబాళ్ల జేజమ్మ ఇటీవల సంభవించిన రోడ్డు ప్రమాదంలో గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతుంది. చికిత్స పొందేందుకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతుంది. విషయం తెలుసుకున్న అనిల్ కుమార్, లక్ష్మీపతి, బాలకృష్ణ, ఆదిత్య హెల్త్ కేర్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ డాక్టర్ దుర్గారావు స్పందించారు. వెంటనే వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స కోసం ఆదిత్య రీసెర్చ్ అండ్ హెల్త్ కేర్ ఫౌండేషన్ ద్వారా రూ.లక్ష క్షతగాత్రులు జేజమ్మ కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో బి.ఊర్మిళ, అనిల్‌కుమార్, బాలకృష్ణ, కె.లక్ష్మీపతి పాల్గొన్నారు.

కూన రవిని విమర్శించే అర్హత 'చింతాడ'కు లేదు



మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఆమదాలవలస : టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్‌ను విమర్శించే అర్హత చింతాడ రవికుమార్‌కు లేదని టిడిపి కార్య నిర్వాహక జిల్లా కార్యదర్శి సనపల ఢిల్లేశ్వరరావు అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 17న మండలంలోని కొర్లకోటలో ఎంపీ రామ్మోహన్‌నాయుడు, జిల్లా టిడిపి అధ్యక్షులు కూన రవికుమార్ పర్యటించారని, ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో స్వయం ప్రకటిత వైసిపి నాయకుడు చింతాడ రవికుమార్ ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వారి స్థాయి ఏమిటో తెలుసుకుని మాట్లాడితే మంచిదని హితవుపలికారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు మాట్లాడుతూ వైసిపికి అధికారం ఇచ్చి ప్రజలు బాధపడుతున్నారని, రానున్న ఎన్నికల్లో ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బోర గోవిందరావు, సంపదరావు మురళి, బి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

పొందూరు కోర్టు సందర్శన

పొందూరు: పొందూరు జుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి గొర్లె చక్రపాణి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పొందూరు కోర్టుకు శాశ్వత భవనం నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, అలాగే కోర్టులో జనరేటర్‌ను ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ సభ్యులు ఆయనకు వినతిని అందించారు. అనంతరం వార్షిక తనిఖీలో భాగంగా పలు కేసులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రాజాం జూనియర్ సివిల్ జడ్జి పి.ఎస్.వి. బి.కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంచరాన రమణమూర్తి, న్యాయవాదులు రఘుబాబు, అశోక్, కిరణ్, సురేష్, కృష్ణారావు, రంగారావు, రామ్మోహనరావు, రాము, బ్రహ్మజీ పాల్గొన్నారు.

జాతీయ సైన్స్ కాంగ్రెస్ విజయవంతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సైన్స్ కాంగ్రెస్ శనివారం ముగిసింది. జీవ సాంకేతిక శాస్త్ర, జంతు, వృక్షశాస్త్ర రంగాల్లో వస్తున్న మార్పులపై మరిన్ని పరిశోధనలల ఆవశ్యకతను తమిళనాడుకు చెందిన ప్రొఫెసర్ ఇ.విజయన్ వివరించారు. సొసైటీ ఫర్ బయో టెక్నాలజీ ఇన్ ఇండియా సంస్థ తరపున ఆన్‌లైన్‌లో పరిశోధనా పత్రాలను అందజేసిన పలువురికి సంస్థ కార్యదర్శి డాక్టర్ టి.అంజు సమక్షంలో అవార్డులను ప్రకటించారు. అలాగే బయోటెక్నాలజిస్టు సొసైటీలో చేరిన సభ్యులకు సభ్యత్వ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. నగరానికి చెందిన ప్రముఖ స్త్రీ శస్త్ర చికిత్సల వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్ పాల్గొని మ్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు కృత్రిమ గర్భధారణ విధానాలతో పాటు ఆధునిక పద్ధతులపై వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా సంతానోత్పత్తిలో వస్తున్న మార్పులను గుర్తుచేశారు. లైఫ్ సెల్ ఇంటర్నేషనల్ అధినేత ఎ.వెంకటశేషు మూలకణాల ఆవశ్యకతను, వాటిని భద్రంగా భద్రపరిచి భవిష్యత్‌లో ముఖ్యమైన కణాల ఉత్పత్తిలోనూ, అవయవాల ఉత్పత్తిలోనూ వినియోగించే అంశాలను, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఐవిఎఫ్ విభాగంలో అవార్డును కళాశాల జీవ సాంకేతికశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఆర్.హరిత, లైఫ్‌సెల్ ఇంటర్నేషనల్ ప్రకటించిన అవార్డును జంతుశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ వై.పోలినాయుడులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ, ఐక్యూ కో-ఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.శాంతిదేవి, సమన్వయకర్తలు డాక్టర్లు వై.పోలినాయుడు, పి.రామారావు, అధ్యాపకులు డాక్టర్ ప్రమీల రవీంద్ర, హారతి, రవిబాబు పాల్గొన్నారు. అనంతరం ప్రొఫెసర్ విజయన్‌ను ఘనంగా సత్కరించారు.

విజయన్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

బ్యాంకు లావాదేవీలపై అప్రమత్తం

మాట్లాడుతున్న మేనేజర్ హేమసుందర్

కవిటి: విద్యార్థులు బ్యాంకు లావాదేవీలు నిర్వహించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనవసరమైన సందేశాలకు స్పందించకూడదని డిసిసిబి ఈదుపురం బ్రాంచ్ మేనేజర్ ఐ.హేమసుందర్ సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఈదుపురం ఆధ్వర్యాన డిజిటల్ బ్యాంకింగ్ ప్రయోజనాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థులకు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు బ్యాంకు లావాదేవీలు నిర్వహించినప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో రుణయాప్‌లు చాలా పుట్టుకొస్తున్నాయని, అందులో నకిలీ యాప్‌లే అధికమని అన్నారు. సైబర్ నేరగాళ్ల విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు మాట్లాడుతూ నేటి కాలంలో మొబైల్ వాడకంలో విద్యార్థులే ఎక్కువగా ఉన్నారని, తప్పటడుగు వేస్తే కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని విద్యార్థులను హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సూపర్‌వైజర్ జి.నవీన్‌కుమార్, కవిటి పిఎసిఎస్ సిఇఒ వి.జానకిరావు, ఎన్ఎస్ఎస్ పిఒ జె.పాపారావు, నర్సింహకుమార్ దాస్ పాల్గొన్నారు.

ఆరుతడి పంటలతో అధిక లాభాలు

వ్యవసాయ శాఖ జెడి శ్రీధర్

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

రబీలో సాగు చేసే మినప, పెసర, వేరుశెనగ తదితర పంటల్లో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి కె.శ్రీధర్, జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు త్రినాథస్వామిలు అన్నారు. మండలంలోని కొత్తపేట రైతు భరోసా కేంద్రంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండల వ్యవసాయ సహాయకులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు సిబ్బందితో నిర్వహించిన పొలంబడిపై సమీక్షించారు. రబీ సాగులో రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పంట మార్పిండి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టెక్కలి ఎడిలు ఆర్.రవిప్రకాష్, వెంకటరావు, ఎఒలు సూర్యకుమారి, ఎస్.గోవిందరావు, రెండు మండలాల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పలాస: ఖరీఫ్ అనంతరం ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలని, వీటి ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని పలాస వ్యవసాయశాఖ ఎఒ కిల్లి పోలారావు అన్నారు. మండలంలోని వీరభద్రపురంలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ క్లస్టర్ డెమోస్ట్రేషన్ పథకంలో భాగంగా పెసర, మినుము విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరుతడి పంటలు పండించేందుకు ముందుకు రావాలని కోరారు. రైతులకు నూతన పద్ధతులు, మెలుకవులపై అవగాహన కల్పించారు. మినుము పంటకు పూత, పిందే కట్టే దశలో రసం పీల్చి పురుగులు నివారణకు ఎసిపేట్ 350 గ్రాములు డైమితోయేట్ 400 ఎంఎల్ ఎకరమునకు, 200 లీటర్స్ నీటిలో కలిపి ఎకరమునకు స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఇఒ ఎస్.పాపారావు, మాజీ సర్పంచ్ టి.కృష్ణమూర్తి, కె.సత్యవతి, రైతులు కె.మాధవయ్య, పి.మోహనరావు, వై.గణపతిరావు పాల్గొన్నారు.

నందిగాం : రబీలో ఆరుతడి పంటలపై రైతులను చైతన్య పరచాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అధికారులను కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న వేరుశనగ, పెసర, మినుము, సన్ ఫ్లవర్ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్లాన బైరాగి, ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి, ఎఒ శ్రీకాంత్‌వర్మ పాల్గొన్నారు.

కోటబొమ్మాళి : మాట్లాడుతున్న జెడి శ్రీధర్